నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, ఆదివారం 11 ఆగస్టు 2024 | NIZAMABAD


## కటకటాల్లోకి నరేందర్

**14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు**

వినాయక్‌నగర్, ఆగస్టు 10: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిజామాబాద్ బల్దియా సూపరింటెండెంట్ నరేందర్‌కు ఏసీబీ కోర్టు శనివారం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. నరేందర్ నివాసంతో పాటు పలుచోట్లు శుక్రవారం ఏసీబీ అధికారులు దాడి చేసి రూ.6 కోట్లకు ఆస్తులను సీజ్ చేసి, అతడ్ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. నరేందర్‌ను శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది. మరోవైపు, ఏసీబీ అధికారుల విచారణ రెండో రోజు కూడా కొనసాగింది. నరేందర్ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా, అక్రమార్జనలో ఎవరెవరికి సంబంధం ఉందన్న దానిపై విచారణ జరుపుతున్నారు. నరేందర్, కుటుంబ సభ్యులకు సంబంధించి 8 బ్యాంకు ఖాతాలను గుర్తించిన అధికారులు.. వాటి నుంచి ఎలాంటి లావాదేవీలు జరుగకుండా బ్యాంకులకు నోటీసులు జారీ చేశారు. ఆయా ఖాతాలను ఫ్రీజ్ చేయాలని ఆదేశించారు. మరోవైపు, సూపరింటెండెంట్‌కు పోస్టాఫీసులోనూ డిపాజిట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నరేందర్‌తో పాటు అతని కుటుంబ సభ్యుల పేర్లపై పోస్టాఫీసుల్లో ఎన్ని ఖాతాలు ఉన్నాయి. వాటిల్లో ఉన్న డిపాజిట్లు ఎంత అన్న దానిపై అధికారులు శనివారం వివరాలు సేకరించారు.



# మరింత లోతుగా

**బల్దియా బాగోతాలపై ఏసీబీ నజర్**



- నరేందర్ అక్రమార్జనపై కొనసాగుతున్న దర్యాప్తు
- బ్యాంకులు, పోస్టాఫీస్‌ల్లో డిపాజిట్లపై నజర్
- సహకరించిన ఉన్నతాధికారుల పాత్రపైనా విచారణ?
- టాక్ ఆఫ్ ది టౌన్‌గా నరేందర్ వ్యవహారం
- పట్టుబడిన నోట్ల గుట్టలపై సర్వత్రా చర్చ

*నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఏండ్లుగా పాతుకుపోయి అక్రమంగా రూ.కోట్లు కొల్లగొట్టిన సూపరింటెండెంట్, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి నరేందర్ వ్యవహారంపై ఏసీబీ మరింత లోతుగా విచారిస్తున్నది. దశాబ్ద కాలంగా ఒకే చోట తిష్ట వేసుకుని అతగాడు సాగించిన అరాచకాలకు ఎవరెవరు సహకరించారనే దానిపైనా దృష్టి సారించినట్లు తెలిసింది. మరోవైపు, బల్దియాలో జరుగుతున్న అవినీతి బాగోతాలపైనా నిఘా పెట్టినట్లు సమాచారం. నరేందర్ ఆగడాలపై వెల్లువలా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా దాదాపుగా ఏడాది నుంచే ఏసీబీ కన్నేసి ఉంచినట్లు తెలిసింది. అనువైన సమయం కోసం వేచి చూస్తున్న అధికారులు.. పక్కా సమాచారం రావడంతో ఈనెల 9న ఏక కాలంలో దాడులు చేశారు. ఈ క్రమంలో లభ్యమైన నోట్ల కట్టలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారాయి. నిజామాబాద్ జిల్లాలో వెలుగు చూసిన అతి భారీ అవినీతి కేసు ఇదే అని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు, శనివారం రోజంతా నరేందర్ వ్యవహారంపైనే జోరుగా చర్చ జరిగింది. నగర పాలక సంస్థలో తమకు ఎదురైన ఇబ్బందులను, ఇచ్చుకున్న ముడుపులకు సంబంధించిన అనుభవాలను బాధితులు గుర్తు చేసుకుంటూ 'పాపం పండింది' అంటూ సంతోషం వ్యక్తం చేయడం కనిపించింది.*

*–నిజామాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

మున్సిపల్ ఉద్యోగి వద్ద ఏకంగా రూ.కోట్ల లో ఆస్తులు బహిర్గతం కావడంతో, అతడికి అండదండలు అందించిన వారిపైనా ఏసీబీ నజర్ పెట్టినట్లు తెలిసింది. నరేందర్‌తో కొందరు ఉన్నతాధికారులు అంటకాగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం జరిగిన సోదాల్లో మున్సిపల్ కార్పొరేషన్‌లోని నరేందర్ చాంబర్‌లో రూ.90వేలు నగదు పట్టుబడడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ మొత్తాన్ని కార్యాలయంలోనే మరో అధికారికి ఇచ్చేందుకే సిద్ధం చేసినట్లు ఏసీబీ గుర్తించింది. ఈ క్రమంలోనే నిజామాబాద్ బల్దియాలో జరుగుతున్న అక్రమాలపై ఏసీబీ మరింత లోతైన దర్యాప్తునకు సిద్ధమైంది. అక్రమాలను సక్రమం చేసేందుకు రాజకీయ నాయకులు, రియల్టర్లు, డాక్యుమెంట్ రైటర్లతో చేతులు కలిపి భారీగా ముడుపులు తీసుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. అక్రమాలను అడ్డుకోవాల్సిన ఉన్నతాధికారులు కళ్లు మూసుకుని నరేందర్ ఏది చెబితే దానికి తలూపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనేది అంతు చిక్కడం లేదు. కళంకిత ఉద్యోగిని నమ్మి మిగిలిన విభాగాల బాధ్యతలను అప్పగించి పెత్తనం చెలాయించేందుకు అవకాశాన్ని కల్పించడంలో ఉన్నతాధికారుల ఉద్దేశం ఏమిటన్న దానిపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. ఖాళీ జాగాలను కాజేయడం, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టడం, అక్రమ నిర్మాణాలకు యథేచ్ఛగా అనుమతులు ఇవ్వడం ద్వారా ఎక్కువగా వసూళ్లు జరిగినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చేసే ప్రతి పనిలో కార్పొరేషన్ ఉన్నతాధికారులకు సైతం వాటాలు ఇస్తున్నట్లు నరేందర్ ప్రచారం చేస్తూ అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేవాడని బాధితులు బహిరంగంగానే చెబుతున్నారు. రెండు వారాల క్రితమే నగరంలో పలు హోటళ్లపై దాడులు నిర్వహించగా, అందులోనూ భారీగా ముడుపులు ముట్టినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దాడులను ఆపేసి మిగిలిన హోటళ్ల నుంచి వసూళ్లు చేస్తున్న క్రమంలోనే ఏసీబీ సోదాల్లో సదరు వ్యక్తి అరెస్ట్ కావడంతో హోటల్ యాజమాన్యాలు సైతం ఊపిరి పీల్చుకున్నాయి.

### ఉచ్చులో ఉన్నతాధికారులు..

## ఆ సొమ్ము.. ప్రజలకే ఖర్చు పెట్టాలి

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్**



వినాయక్‌నగర్, ఆగస్టు 10: మున్సిపల్ కార్పొరేషన్‌లో దోచుకున్న ప్రతి పైసా నగర అభివృద్ధికి ఉపయోగించాలని, ఏసీబీ అధికారులు రికవరీ చేసిన డబ్బు తిరిగి మున్సిపల్ ఖాతాలో జమచేసి అభివృద్ధికి ఖర్చు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందూరు మున్సిపాలిటీ అవినీతికి కేరాఫ్ అడ్డాగా మారిందని, తాను గెలిచిన నాటినుంచి ఇదే విషయమై పలుమార్లు హెచ్చరించినట్లు తెలిపారు. శుక్రవారం ఓ అధికారి ఇంట్లో జరిగిన ఏసీబీ దాడుల్లో రూ.6 కోట్ల వరకు అక్రమ సంపాదన దొరకడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మున్సిపల్‌లోని వివిధ శాఖల్లో అవినీతి తిమింగిలాలు ఇంకా ఉన్నాయని, అవినీతి ప్రక్షాళన మరింత జరగాల్సిన అవసరం ఉన్నదని ప్రకటనలో తెలిపారు.



చేతులు శుభ్రం చేసుకోవడానికి కుళాయి లేక విద్యార్థుల అగచాట్లు

**విద్యార్థులు ఫుల్.. సౌకర్యాలు నిల్**

# గురుకులం.. సమస్యలు అనేకం

**దోమలు, విషపురుగులతో సావాసం..**
**జ్వరాలు ప్రబలే అవకాశం**
**పట్టించుకోని సర్కారు..**
**ఇబ్బందుల్లో పిల్లలు**
**ఎర్రపహడ్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల దుస్థితి..**

*సరిపడా లేని మరుగుదొడ్లు.. తలుపులు లేని స్నానపు గదులు.. కిటికీలకు చిరిగిన జాలీలు.. పాఠశాల ఆవరణలో పశువులు, గొర్రెల సంచారం.. అపరిశుభ్రత.. అసౌకర్యాల నడుమ నడుస్తోంది గురుకుల పాఠశాల. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని ఎర్రపహడ్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.*

*– లింగంపేట, ఆగస్టు 10*



మరుగుదొడ్డి తలుపుల దుస్థితి

లింగంపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. తాడ్వాయి మండలం ఎర్రపహడ్ గ్రామంలోని బాలుర గురుకుల పాఠశాలను మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. గతేడాది వరకు ఐదు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు కల్పించారు. ఈ సంవత్సరం నూతనంగా ఇంటర్ విద్యార్థులకు అవకాశమిచ్చారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో సమస్యలు సైతం పెరిగిపోయాయి. విద్యార్థులు కనీసం కాలకృత్యాలు తీర్చుకోవడానికి సరైన సౌకర్యాలు లేకుండా పోయాయి. మొత్తం 451 మంది విద్యార్థులుండగా, వీరిలో 59మంది ఇంటర్, 392 మంది పాఠశాల విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ కలిపి ఆవరణలో కేవలం 16 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో నిత్యం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు ఆరుబయటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. పాఠశాల వెనుక భాగంలో కుంట ఉండడంతో విద్యార్థులకు ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. స్నానాల గదులకు తలుపులు లేకుండా పోయాయి. బాత్‌రూంలలో నీటి సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ నల్లాలు బిగించలేదు. దీంతో నీటి సరఫరా లేక స్నానాల కోసం బకెట్లలో నీటిని తీసుకువెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. భోజనం చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడానికి డ్రమ్ముల్లో ఉండే నీటిని ఉపయోగిస్తున్నారు. గురుకుల పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా వంట గది, భోజనశాల లేకపోవడంతో తరగతి గదుల్లోనే వంట చేస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, గొర్రెల సంచారిస్తుంటాయి. తరగతి గదుల కిటికీలకు జాలీలు చిరిగిపోయి ఉండడంతో రాత్రివేళలో దోమలతో సహవాసం చేయాల్సి వస్తున్నది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నది. అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కిటికీలకు చిరిగిపోయిన జాలీలు

# అధికారుల్లో కదలిక..

- అసైన్డ్ భూముల స్వాహాపై ముందే హెచ్చరించిన 'నమస్తే తెలంగాణ'
- త్వరలోనే పరిశీలనకు అధికారుల రాక
- 17లోగా నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశం..

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

బాన్సువాడ, ఆగస్టు 10: బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని అసైన్డ్ భూముల స్వాహాపై ఎట్టకేలకు అధికారుల్లో కదలిక వచ్చింది. పట్టణంలోని వెంచర్లు, చెరువుల కింద శిఖం, బఫర్ జోన్‌లో ఉన్న వెంచర్లను పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు త్వరలోనే పరిశీలనకు రానున్నట్లు తెలిసింది. పరిశీలన నివేదికను ఈ నెల 17లోగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా బాన్సువాడలోని పలు ప్రాంతాలు, చెరువు కింద శిఖం భూములను రియల్టర్లు కబ్జా చేస్తున్నారన్న విషయాన్ని 'నమస్తే తెలంగాణ' ముందే హెచ్చరించింది. జూన్ 9న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితం చేసింది. అధికారుల తీరుపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. తాజాగా పలువురు బీజేపీ నాయకులు చెరువుతోపాటు కబ్జాకు గురైన స్థలాన్ని శనివారం పరిశీలించారు. కబ్జాకు గురైన స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.



## హరిత దారులు..

హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన హరితహారం ఫలాలు ప్రస్తుతం కండ్లముందు కనిపిస్తున్నాయి. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి తోరణాల మాదిరి స్వాగతం పలుకుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని గుండారం నుంచి మల్కాపూర్ వైపు వెళ్లేదారిలో కనిపించిన ఈ దృశ్యాలను నమస్తే తెలంగాణ క్లిక్‌మనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## కొత్త పంచాయతీలు ఏర్పాటు

కోటగిరి, ఆగస్టు 10: కోటగిరి మండలంలో కొత్తగా మరో మూడు గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. గతంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్తగా మరో మూడు ఎక్లాస్‌పూర్‌క్యాంప్, శ్రీనివాస రెడ్డి కాలనీ, ఎత్తొండక్యాంప్‌లను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీంతో కోటగిరి మండలంలో16 గ్రామ పంచాయతీ లు ఏర్పాటైనట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి తెలిపారు.

**పొతంగల్‌లో ఐదు..**

పొతంగల్, ఆగస్టు 10: పొతంగల్ మండలంలో ఐదు గ్రామ పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంపీడీవో మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 15 గ్రామ పంచాయతీలు ఉండగా మరో ఐదు పంచాయతీలో 20కి చేరుకున్నాయి. జల్లాపల్లి గ్రామం, జల్లాపల్లి తండా, తిరుమలాపూర్, భాకర ఫారం, పీఎస్‌ఆర్ నగర్ కొత్త జీపీలుగా ఏర్పడ్డాయి.

**రుద్రూర్ మండలంలో.. కొందాపూర్**

రుద్రూర్, ఆగస్టు 10: రుద్రూర్ మండలంలో కొందాపూర్‌ను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు అంబం గ్రామ పంచాయతీతో కలిసి ఉన్న కొందాపూర్ ప్రస్తుతం ప్రత్యేక జీపీగా మారనున్నది.

## సీపీగెట్‌లో ఫస్ట్ ర్యాంక్

**ప్రవేశ పరీక్షలో ఇందూరు విద్యార్థిని ప్రతిభ**



ఖలీల్‌వాడి, ఆగస్టు 10: ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీపీగెట్–2024లో ఇందూరు విద్యార్థిని ప్రతిభ చాటింది. ఎమ్మెస్సీ డాటాసైన్స్ విభాగంలో ప్రవేశానికి జరిగిన ప్రవేశపరీక్షలో రాష్ట్రంలోనే మొట్టమొదటి ర్యాంకును నగరానికి చెందిన మంచిర్యాల నిహారిక సాధించింది. నగరంలోని జెండాగల్లీకి చెందిన మంచిర్యాల బ్రహ్మం–వనజ దంపతుల కుమార్తె నిహారిక.. కాగా తండ్రి బ్రహ్మం బతుకుదెరువు కోసం దుబాయికి వలస వెళ్లాడు.


నేడే ప్రారంభోత్సవము
ఆగస్టు 11, 2024 ఉ॥11గం॥లకు ఆదివారము
నిజామాబాద్‌లోని AIIMS, న్యూరో డాక్టర్ సేవలను వినియోగించుకోండి
శ్రీ భవాని కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
భారత్ ల్యాబ్ ఎదురుగా, ఖలీల్‌వాడి, నిజామాబాద్
సెల్: +91-9963093892, +91-7569080868
డా॥గోవీన్ మంద
కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్
MBBS, MD (NIMS, Hyd) MRCP (UK)
DM (AIIMS, NEW DELHI)
Reg No : TSMC/FMR/01710
శ్రీ భవాని కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
ముఖ్య అతిథులు:
డా॥బి.దామోదర్ రావు, DA, అధ్యక్షులు, IMA | డా॥కె.శ్రీశైలం, M.B.B.S, DCH, జనరల్ సెక్రటరీ, IMA | డా॥బి.రాజేంద్రప్రసాద్, DTCD, DNB, ట్రెజరర్, IMA | డా॥ఎస్.శివప్రసాద్, M.B.B.S, D (Ortho), అధ్యక్షులు, THANA